క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపికలు

సాక్షి నెట్‌వర్క్: హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లోని రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల్లో నాల్గో తరగతి ప్రవేశాలకు ఎంపిక పోటీలు జరుగనున్నట్లు ఆయా మండలాల ఎంఈఓలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 3వ తరగతి ఉత్తీర్ణులై ప్రస్తుతం 4వ తరగతి చదువుతుండాలని చెప్పారు. విద్యార్థుల జననం సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 31, 2017 ఉండాలన్నారు. ఈనెల 19లో సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు 2పాస్ ఫొటోలు, కుల, జనన ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్ కార్డు ఒరిజనల్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకురావాలని తెలిపారు.

బొడ్రాయి వేడుకలు



కురవి: మండల కేంద్రంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయికి మహిళలు జలాలతో అభిషేకాలు చేశారు. ఎస్సై గండ్రాతి సతీష్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా చక్రస్నానం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో అమీనాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నవకలశ స్నానం, చక్రస్నానం, పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓలం మురళీ, సెక్రటరీ బచ్చు పరమేశ్వర్, కోశాధికారి యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భావ్‌సింగ్‌కు డాక్టరేట్



గార్ల : బాసర ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా (హెచ్ఓడీ) పనిచేస్తున్న గార్ల మండలం సీతంపేట గ్రామవాసి భావ్‌సింగ్ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. 'ఎలక్ట్రికల్ వెహికల్ అప్లికేషన్స్ కోసం ఇండక్టివ్ కపుల్డ్ వైర్‌లెస్ చార్జింగ్' అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

వీరన్న సన్నిధిలో మధుయాష్కీ గౌడ్ పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని మాజీ ఎంపీ, టీపీసీసీ క్యాంపెనింగ్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఆదివాసీ గిరిజన జాతీయ నేత తేజావత్ బెల్లనాయక్‌లు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ సత్యనారాయణ, పూజారులు స్వాగతం పలికారు. వారి వెంట టీపీసీసీ ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త వెంకటేశ్ గౌడ్, మండల అధ్యక్షుడు వీరభద్రంగౌడ్, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

మూడేళ్లుగా పిల్లర్లకే పరిమితం

- బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..
- వాగు దాటాలంటే ఇబ్బంది పడుతున్న రైతులు



పోచారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

పెద్దవంగర: వర్షాకాలం సమీపిస్తోంది. కానీ పాలేరు వాగుపై వంతెన కల మాత్రం అందని ద్రాక్షలానే మిగిలింది. పెద్దవంగర మండలం పోచారం, సూర్యాపేట జిల్లాలోని గొట్టిపర్తి గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన ఈ వంతెన పనులు మూడేళ్లుగా కేవలం పిల్లర్లకే పరిమితం అయ్యింది. పాలకులు మారుతున్న తమ కష్టాల తీరడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మొదలైతే తమ రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని దీంతో నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

మూడేళ్ల క్రితం మొదలు..

2022 డిసెంబర్ 12 అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వంతెనకు భూమి పూజ చేశారు. ఎంఆర్ఆర్ నిధుల నుంచి రూ.5.90కోట్లు మంజూరు చేయగా టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయ్యింది. కాగా నాటి నుంచి నేటి వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కిమీ దూరంలో ఉన్న గొట్టిపర్తికి వెళ్లాలంటే వడ్డెకొత్తపల్లి బిడ్జి మీదుగా చుట్టు తిరిగి 18కిమీ ప్రయాణం చేయవలసి వస్తోంది. దీంతో రైతులు తమ పొలాలకు అరకలు, విత్తనాలు, ఎరువులు, ఇతర పనిముట్లు తీసు కెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. గీత కార్మికులకు ఉపాధినిచ్చే తాటి వనాలు సైతం వాగు అవతల ఉండడంతో వారికి నిత్యం కష్టాలే పడుతున్నారు. అలాగే కర్నాల కుంట గిరిజన ప్రజల తుంగతుర్తికి వెళ్లాలంటే వర్షాకాలంలో వాగు దాటడం పెద్ద సమస్యగా మారిందని పేర్కొంటున్నారు.

వంతెన పనులు వేగవంతం చేయాలి



మా గ్రామ పరిధిలోని పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోంది. రానున్న వర్షాలతో రాకపోకలు కొనసాగేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వంతెనను త్వరగా నిర్మిస్తే రైతులు తమ పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోవడానికి వీలుంటుంది. గొట్టిపర్తి, పోచారం గ్రామాలతోపాటు పలు గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గుతుంది. బిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేయాలి.

- మద్దెల యాకన్న, పోచారం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే మురళీనాయక్



గూడూరు: ఇంటి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి, ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పాలనలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, ఎంపీఓ సత్యనారాయణ, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ ప్రవీణ్, నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని పర్వతగిరి, సోమ్లు తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. మల్యాల గ్రామంలో లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

అయోధ్య గ్రామ చెరువుకట్ట మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని అయోధ్య గ్రామ చెరువుకట్ట వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ఎమ్మెల్యే సోమవారం సందర్శించి పరిశీలించారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/దంతాలపల్లి: ఆరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీన (నేడు) ఇందిరాపార్క్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం ఆవిష్కరించారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని చేపట్టిన ఉద్యమంలో భాగంగా వామపక్షాల నాయకులు సోమవారం కోర్టుకు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, హలవత్ లింగ్యా, నందగిరి వెంకటేశ్వర్లు, గుజ్జు దేవేందర్, చింతకుంట్ల వెంకన్న, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం..



రాకేష్

డోర్నకల్: డోర్నకల్ మండలం రావిగూడెం సమీపంలో ఓ యువకుడి అదృశ్యం స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం మహబూబాబాద్‌కు చెందిన ఉల్లి రంజిత్‌కుమార్ ఎలియాస్ రాకేష్(26) ఆర్టీసీ బస్టాండ్‌లో తన తండ్రి సురేష్‌తో కలిసి పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం రావిగూడెంలో తన బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. ఆదివారం సాయింత్రం తల్లి విజయలక్ష్మి వద్ద రూ.20 తీసుకుని రావిగూడెంలోని బంధువు ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. రాత్రి గంటల వరకు రాకేష్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో సోమవారం తెల్లవారుజాము నుంచి రాకేష్ ఆచూకీ కోసం వెతుకుతుండగా.. గ్రామానికి 2.5కిలోమీటర్ల దూరంలో సీతారామ ప్రాజెక్ట్ కాల్వ కట్టపై ఓ చోట సెల్‌ఫోన్, చెప్పులు, వాటర్ బాటిల్, అంబర్ ప్యాకెట్, కొద్ది దూరంలో ద్విచక్రవాహనంతో పాటు దస్తీ పడి ఉందంటూ ఆ ప్రాంత రైతులు సమాచారం అందించారు. దీంతో సీఐ బి.రాజేష్ తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రప్పించడంతో జాగిలం సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి ఆగింది. అనంతరం ఈతగాళ్లను రప్పించి బావుల్లో వెతికినా రాకేష్ ఆచూకీ దొరకలేదు. బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి ఘటనాస్థలానికి వచ్చి విచారణలో పాల్గొన్నారు.

బస్సు చార్జీలను తగ్గించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెహ్రూసెంటర్: పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు డిమాండ్ చేశారు. పెంచిన బస్సుపాసు చార్జీలను తగ్గించాలని నిరసిస్తూ డిపో ఎదుట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. ఇప్పటికే బస్సు పాసు చార్జీలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు పెంచిన చార్జీలు మరింత భారంగా మారుతాయని పేర్కొన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం పునరాలోచన చేసిన చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ సింహాద్రి, భాషపాక పవన్, వీరేందర్, వంశీ, వరుణ్, వినయ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున బ్యాంకుల ద్వారా కొత్త రుణాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసి, తిరిగి వారికి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. యాసంగి బోనస్ నగదును వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, సింగు రమేష్, భీముడు, పిచ్చయ్య, భిక్షం, వెంకటేశ్వర్లు, సక్రు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'రైతునేస్తం' వీసీ యూనిట్ల ప్రారంభం



కురవి: వీసీ తిలకిస్తున్న అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, రైతులు



డోర్నకల్: వీడియో కాన్ఫరెన్స్ చూస్తున్న అధికారులు, రైతులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికల్లో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సీఎం రేవంత్‌రెడ్డి వీడియో వీసీ ద్వారా సోమవారం ప్రారంభించారు. రైతువేదిక భవనంలో రైతులు, వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని తిలకించారు. దీంతోపాటు సీఎం రైతుభరోసా నిధులను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



గూడూరు: మాట్లాడుతున్న సీతారాంనాయక్

గూడూరు: రాబోయో ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మచ్చర్ల శివారు జాతీయ రహదారి పక్కన గల జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ గృహంలో సోమవారం 11ఏళ్ల మోదీ పాలనను పురస్కరించుకొని వికసిత్ భారత్ సంకల్ప సభ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న, మోతీలాల్‌నాయక్, సోమూనాయక్, బావుసింగ్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రామచంద్రరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మోదీ 11ఏళ్ల పాలనపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెన్నమల అజయ్, సందీప్, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగర: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో భారత్ అభివృద్ధి దేశాల సరసన నిలిచిందని జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల అధ్యక్షుడు కట్బోజు భాస్కర్ అధ్యక్షతన వికసిత్ భారత్ అమృత కాలం సభను చేపట్టారు.

పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

తొర్రూరు: రాష్ట్రంలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలకు తొర్రూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. ఈనెల 27నుంచి బస్సులు తొర్రూరు నుంచి బయలు దేరుతాయని, శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్ వీక్షించాలనుకునే వారికి టికెట్ ధర పెద్దలకు రూ.1400, పిల్లలకు రూ.800 ఉంటుందన్నారు ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, కైలాసగిరి, ఆర్కే బీచ్ ప్రాంతాలను సందర్శించాలనుకునే వారికి సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి గానూ పెద్దలకు రూ.1,999, పిల్లలకు రూ.1100 టికెట్ ధర ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 99592 26053, 80744 74984 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

క్రైం కార్నర్..

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

డోర్నకల్: మహబూబాబాద్, గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ సోమవారం తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడు తెలుపు రంగు బనియన్, అదే రంగు నిక్కర్ ధరించాడని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58602 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన మహ్మద్ నజీర్ (35) వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ కలహాలు పెరిగి భార్య సమీనా పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. అక్కడ కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తుంది. ఆదివారం నజీర్ హైదరాబాద్‌కు వెళ్లి మా నాన్న సంవత్సరికం ఉంది గ్రామానికి రావాలని భార్యను కోరాడు. వస్తానని భార్య చెప్పింది. ఆదివారం తన గ్రామమైన అవుతాపురం చేరుకున్నాడు. అదే రోజు రాత్రి ఇంటి ముందు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు సుల్తాన, ఫాతిమా ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..

తొర్రూరు రూరల్: మండలంలోని కర్కాల గ్రామానికి చెందిన ఎర్ర సోమయ్య(77) అనే వృద్ధుడు గత కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రుల చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

కోమటిపల్లిలో ఒకరు..

కేసముద్రం: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోళ్ల నాగరాజు(37) కొంతకాలంగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన అతను గడ్డిమందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు అతడిని 108లో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి అబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

తిరుమలగిరి (తుంగతుర్తి): బైక్ అదుపుతప్పడంతో కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం దాట్ల గ్రామానికి చెందిన కాగితం రమేష్ తన మేనల్లుడు రఘువీర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. తిరుమలగిరి మండలం తొండ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కిరాణ షాపులో చోరీ

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేసముద్రం విలేజిలో ఓ కిరాణం షాపు(గుమ్చీ)లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వేమిశెట్టి వేణు గుమ్చీలో కిరాణం షాపు నడుపుతున్నాడు. ఈక్రమంలో రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి షాపుకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుమ్చీ వెనుకభాగంలో ఉన్న చిన్న డోరును పగులగొట్టి రూ.12వేల విలువైన మద్యం బాటిళ్లు, డెస్క్‌లో ఉన్న నగదు రూ.6వేలు, రూ.2వేల విలువైన సిగరేట్ ప్యాకెట్లను దొంగిలించారు. సోమవారం షాపు యజమాని చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చోరీ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన రెవెన్యూ సదస్సు

మరిపెడ: రైతుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు. మండలంలో ఈనెల 3నుంచి ప్రారంభం అయిన రెవెన్యూ సదస్సులు సోమవారం ముగిశాయి.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.అశ్వినికి ఎన్ఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైందని ఎంఈఓ రాందాస్ తెలిపారు. సోమవారం విద్యార్థినికి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ అశ్విని రూ.1000అందించినట్లు ఎంఈఓ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ సమీపంలో సోమవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన కాడెం బంగారికి చెందిన పాడిగేదె సమీపంలో మేతకు వెళ్లగా విద్యుత్ స్తంభం నుంచి తెగిపడిన తీగను తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు విలపించాడు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

నర్సింహులపేట: మండలంలోని జయపురం గ్రామంలో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల చప్పుడుకు నిద్ర పట్టడం లేదని ట్రాక్టర్లను అడ్డుకున్నారు.

నూతన చర్చి ప్రారంభం

గార్ల: మండలంలోని వేదనాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని డోర్నకల్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కె పద్మారావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.

హద్దులు ఏర్పాటు చేయించాలి

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమిని ఆక్రమించుకున్న కబ్జాదారుల నుంచి భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని, శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను సోమవారం గార్ల మండల రైతులు కలిసి విన్నవించారు. ఎంపీని కలిసిన వారిలో గూగులోత్ శ్రీను, సక్రు, రవి, శివనాయక్ ఉన్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం



డోర్నకల్: స్థానిక అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు, సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మి, సూపర్‌వైజర్ రేఖాబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని మడిపెల్లి, వెలికట్ట గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ తీశారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

డోర్నకల్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు తాళ్లూరి హనుమంతనావు తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల భూమి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి రామయ్య, రామారావు పాల్గొన్నారు. డోర్నకల్ బంకట్‌సింగ్‌తండాలో జరిగిన కార్యక్రమంలో వాంకుడోత్ వీరన్న, కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: వర్షాలు కురుస్తున్నందున వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి సూచించారు. సోమవారం మరిపెడ మండలం బావోజిగూడెం గ్రామంలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వామి, సూపర్‌వైజర్స్ సుదర్శన్, ఆచార్యులు, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఏఎన్ఎం కీర్తి, ఆశ్విని పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో జరగనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ సోమవారం పిలుపునిచ్చారు.

మెడికల్ దుకాణాల తనిఖీలు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి సోమవారం తనిఖీ చేశారు. కొన్ని దుకాణాలకు తాళాలు వేసి ఉన్నాయి. మరోసారి తనిఖీ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

రైతుల రశీదులు ఇవ్వాలని ధర్నా

గార్ల: భూభారతి గ్రామసభలు ముగిసినందున తహసీల్దార్ కార్యాలయంలో మిగిలిపోయిన రైతుల దరఖాస్తులను తీసుకొని వెంటనే రశీదులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎన్‌డీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.


ముగ్గురిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని లాలీతండాలో నిషేధిత బెల్లం, పటిక లభ్యమైన కేసులో ముగ్గురిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. సమాచారం మేరకు ఓ ఇంట్లో 2 బస్తాల నల్లబెల్లం, 5 బస్తాల పటికను పట్టుకున్న ఘటనలో సోమవారం ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందిస్తామని పాఠశాల హెచ్ఎం అనిత అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ డే నిర్వహించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి




తొర్రూరు: విద్యాశాఖలో పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీ రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెల్తూరి మల్లేశం అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సమగ్రశిక్ష సిబ్బంది, మృతుడి సంబంధీకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేగుల సహదేవ్, జిల్లా అధ్యక్షులు మారగోని జానకీరాం, ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎస్ ఎదుట పురుగుమందు డబ్బాతో హల్‌చల్

డోర్నకల్: తమ కూతురికి సంబంధించి తాము చేసిన ఫిర్యాదును పట్టించుకోవడం లేదంటూ ఓ వ్యక్తి సోమవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్ వద్ద పురుగుమందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి హల్‌చల్ చేశాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండలంలోని దాన్యాతండాకు చెందిన సురేష్ తన కూతురును చందు అనే వ్యక్తి వేధిస్తున్నాడంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కేసు నమోదైన తరువాత పెద్దమనుషుల సమక్షంలో తన కూతురును వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి పెళ్లి చేసుకోనంటూ చందుతోపాటు అతడి కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని, కేసు విచారణ పేరుతో పోలీసులు కాలయాపన చేశారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి హల్‌చల్ చేశాడు. తనకు న్యాయం చేయాలంటూ పురుగుమందు తాగుతుండగా ఏఎస్సై కోటేశ్వర్‌రావు అడ్డుకుని మందుడబ్బాను లాక్కోగా డబ్బాలోని మందు ఏఎస్సైపై పడింది. వెంటనే పోలీసులు సురేష్‌ను స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మహబూబాబాద్ తరలించారు. ఘటనపై సీఐ వివరణ కోరగా గతంలోనే ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

'గ్యారంటీ'ల అమలులో విఫలం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సోమయ్య

నెహ్రూసెంటర్: ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యంనగర్‌లో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.